ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

సోమవారం 4 మార్చి 2024



ఉప తహసీల్దార్లకు స్థాన చలనం

నంద్యాల రూరల్, మార్చి 3 : నంద్యాల కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు జిల్లాలోని నలుగురు ఉప తహసీల్దార్లను బదిలీ చేశారు. నంద్యాల ఉప తహసీల్దార్ రమాదేవిని పాణ్యం, పాణ్యం ఉప తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డిని నంద్యాలకు, డోన్ ఉప తహసీల్దార్ మధుని బేతంచర్ల, బేతం చర్ల ఉప తహసీల్దార్ సాయిదీప్‌ను డోన్ కార్యాలయానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు వెంటనే బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు.

హంస వాహనంపై ఆది దేవుడు

- శ్రీగిరిపై వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలి వస్తున్న భక్తులు
- ఇరుముడి స్వాములకు ప్రత్యేక క్యూలైన్

శ్రీశైలం, మార్చి 3: ఇల కైలాసమైన శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన హంస వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు, హారతులు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం నుంచి వెలుపలకి తోడ్కొని వచ్చారు. అనంతరం ఆలయ రాజగోపురం గుండా గంగాధర మండపం చేరుకొని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి క్షేత్రపుర వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, బంజారా నృత్యం, చెంచు నృత్యం, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. హంస వాహనంపై విహరించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు.





హంస వాహనంపై ఊరేగుతున్న ఆది దేవుడు



పాతాళగంగ వద్ద భక్తుల సందడి

పట్టువస్త్రాల సమర్పణ

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం తరఫున ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కె. రాంబాబు, కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, వేదపండితులు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం అధికారులకు స్వాగతం పలికారు. తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.



నేడు మయూర వాహన సేవ

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నాలుగో రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మయూర వాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి

శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. భక్తులతో శ్రీశైల క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. అలాగే క్షేత్రంలోని అన్నదాన సత్రాలు, వసతి కేంద్రాలు భక్తుల సేవలో తరిస్తున్నాయి. బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో శ్రీగిరి చేరుకొని మల్లన్న దర్శనానికి పోటెత్తారు. భక్తులకు దర్శనం కోసం ఉచిత క్యూలైన్, శీఘ్ర దర్శనం, అతి శీఘ్రదర్శనంతోపాటు జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామివారి స్పర్శ దర్శనానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి సమర్పణ

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండల, అర్ధమండల దీక్షను స్వీకరించిన శివ స్వాములు శ్రీశైలం మల్లన్నకు ఇరుముడులు సమర్పిస్తున్నారు. ముందుగా దేవస్థానం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ల ద్వారా శివస్వాములు ఇరుముడులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శివదీక్షా శిబిరాలలో శాస్త్రోక్తంగా శివదీక్ష విరమించారు.



కంపార్టుమెంటులో శివస్వాములు




కాలినడకన వెళ్తున్న భక్తులు

ఓటు పనులు

- ఎన్నికల వేళ తెరపైకి షాదిఖానా
- ప్రణాళికకు భిన్నంగా నిర్మాణం
- టీడీపీ హయాంలోనే నిధులు మంజూరు
- స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది బుడ్డా వెంగళరెడ్డి
- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా ఇప్పుడు హడావుడి
- ఎన్నికల ముందు వైసీపీ ఆర్భాట ప్రచారం
- మైనార్టీ ఓట్ల కోసమేనని విమర్శలు

ఆత్మకూరు, మార్చి 3:

ఎన్నికల వేళ షాదిఖానా నిర్మాణం తెరపైకి వచ్చింది. నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు హడావుడి చేస్తోంది. అంతా తామే చేసినట్టుగా కలరింగ్ ఇచ్చుకుంటోంది. ఆత్మకూరు ప్రాంతంలో అత్యధికంగా ముస్లింలు ఉన్నారు. నిరుపేద మైనార్టీ కుటుంబాలు సరైన సదుపాయాలు లేక ఇరుకు సందుల్లోనే వివాహాలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని శివార్లలోని శ్రీశైలం రస్తాలో షాదిఖానాకు సొంత ఖర్చుతో ఎకరా భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత 2002లో మాజీ ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి హయాంలో వివాహాలు, ఇతర శుభకార్యాలను అతి తక్కువ ఖర్చుకే జరుపుకునేందుకు షాదిఖానాను అందుబాటులోకి తెచ్చారు. అయితే షాదిఖానా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో 2019నాటికి శిథిలమై శుభకార్యాలు జరుపుకునేందుకు కూడా వీల్లేకుండా పోయింది. దీంతో అత్యాధునిక హంగులతో షాదిఖానాను నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సంకల్పించి పనులు కూడా ప్రారంభించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాలుగున్నరేళ్లుగా షాదిఖానా పనులను పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అధికార పార్టీ నాయకులు మొక్కుబడిగా పనులు పూర్తి చేయించారు. దీంతో ఇదంతా మైనార్టీల ఓటర్లకు గాలం వేసేందుకేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సదుపాయాలు లేకుండానే ప్రారంభించనున్న షాదిఖానా

ఆత్మకూరు ప్రాంతంలో ముస్లింల జనాభా అత్యధికంగా ఉండటంతో వారి సంక్షేమం కోసం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శిథిలమైన షాదిఖానా స్థానంలో అత్యాధునిక హంగులతో షాదిఖానా నిర్మాణం చేపట్టాలని ముందుకొచ్చారు. ఇందులో భాగంగానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేయించారు. అయితే అనుకున్న ప్రణాళిక ప్రకారం షాదిఖానా నిర్మాణానికి మరో రూ.20 లక్షలు అదనంగా కావాల్సి వచ్చింది. దీంతో తనకు కేటాయించిన ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.20 లక్షల నిధులను సమకూర్చారు. షాదిఖానా భవన నిర్మాణం పూర్తి స్థాయిలో ఇస్లాం సంప్రదాయాల ప్రకారమే రూపుదిద్దుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం హైద్రాబాద్‌కు చెందిన పీఅండ్‌వీ ఆర్కిటెక్ సంస్థ ద్వారా నాలుగు రకాల డిజైన్‌లను తయారు చేసి అందులో మైనార్టీల సూచన మేరకు ఓ డిజైన్‌ను ఎంపిక చేశారు. ఈ ప్రణాళికలో ప్రధానంగా నిఖాహాల్, డైనింగ్ హాల్, వంటశాల, 8 వసతి గదులు, మహిళలకు ప్రత్యేక నిఖాహాల్ నిర్మించాలని భావించారు. అంతేగాకుండా ఈ షాదిఖానాలో ఒకేసారి 600 మంది కూర్చునేందుకు వీలుగా నిఖా హాలుతోపాటు 500 మందికిపైగా భోజనం చేసేలా డైనింగ్ హాలును నిర్మించేలా డిజైన్ చేశారు. అదేవిధంగా వాహనాల పార్కింగ్, ల్యాండ్ స్కేప్‌తో కూడిన ఉద్యాన వనాలను ఏర్పాటు చేయాలని రూపకల్పన చేశారు. ప్రత్యేకించి షాదిఖానా ప్రవేశ ద్వారం కూడా ముస్లిం సంప్రదాయబద్ధంగా ఉండేలా అత్యాధునిక ఎల్ఈడీ లైట్లను అమర్చాలని నిర్ణయించారు.



టీడీపీ హయంలో 2019 జనవరి 3న షాదిఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దృశ్యం

2019 జనవరి 3న షాదిఖానా నిర్మాణానికి శంకుస్థాపన

2019 జనవరి 3వ తేదీన అప్పటి వైద్య విద్యాశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి మస్తాన్‌వలి షాదిఖానా నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఆరు నెలల్లోగా షాదిఖానా భవనాన్ని పూర్తి చేయించాలని గడువు విధించారు. మార్చి నాటికి పునాదులతోపాటు కాంక్రీట్ పిల్లర్స్ వరకు పనులను వేగంగా పూర్తి చేశారు. అయితే ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో షాదిఖానా నిర్మాణం అటకెక్కింది. నాలుగున్నరేళ్లపాటు షాదిఖానా పనుల జోలికి వెళ్లలేదు. ఇప్పుడు తీరా ఎన్నికలు సమీపిస్తుండటంతో మైనార్టీల ఓట్ల కోసం షాదిఖానా నిర్మాణాన్ని తెరపైకి తెచ్చారు. తామే నిర్మిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిర్ణయించిన ప్రణాళికకు విరుద్ధంగా పనులు చేపట్టారు.



కాంక్రీట్ స్లాబ్ నిర్మాణానికి బదులు రేకులతో నిర్మించిన పైకప్పు

కాంక్రీట్ స్లాబ్‌తో కాకుండా రేకులతో..

ఆత్మకూరులో మార్చి 3వ తేదీన ప్రారంభించిన నూతన షాదిఖానా నిర్మాణం పైన పటారం.. లోన లొటారం అన్న విమర్శలు ఉన్నాయి. షాదిఖానా ముందు భాగంలో ఎలివేషన్ ఆకర్షణీయంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ నిర్మాణ ప్రక్రియ మాత్రం ముందుగా నిర్ణయించిన ప్రణాళికకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి షాదిఖానా భవన నిర్మాణాన్ని కాంక్రీట్ స్లాబ్‌తో నిర్మించాల్సి ఉండగా రేకులతో కప్పివేశారు. దీంతో వేసవిలో షాదిఖానా భవనాలు అసౌకర్యంగా మారనున్నాయి. వర్షం కురిస్తే కూడా నిఖా హాల్‌లోకి తుంపర్లు పడే అవకాశం ఉంది. చివరికి ఫినిషింగ్‌లో భాగంగా రేకులకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ)తో సీలింగ్ చేయకపోవడంతో సాదాసీదాగానే కనిపిస్తోంది. అన్ని అత్యాధునిక హంగులతో షాదిఖానా నిర్మాణం జరగాల్సి ఉండగా ఇప్పటివరకు వధూవరుల గదులు, వంట గదులు, వసతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదని తెలిసింది. ల్యాండ్ స్కేప్‌తో కూడిన ఉద్యాన వనాల జోలికే వెళ్లలేదు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో మిగిలిన పనులను నాసిరకంగా హడావిడిగా పూర్తి చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మైనార్టీ ఓట్ల కోసమే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఇలా చేస్తున్నారని మైనార్టీ శ్రేణులే చర్చించుకోవడం గమనార్హం.

ముస్లింల ఓట్ల కోసమే..



ముస్లింల ఓట్ల కోసమే షాదిఖానాను హడావిడిగా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రూ.2.2 కోట్ల నిధులను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేయించారు. పనులను కూడా మొదలు పెట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా ఎన్నికలు వస్తున్నాయని నాసిరకంగా పనులను చేపట్టింది. షాదిఖానా నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభించడం విడ్డూరంగా ఉంది.

-షాబుద్దీన్,
మైనార్టీ నాయకుడు, ఆత్మకూరు

ఆత్మకూరు షాదిఖానా బుడ్డా కుటుంబం చలువే



నిరుపేద ముస్లింల కోసం షాదిఖానా నిర్మించేందుకు అప్పట్లో మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి తన సొంత ఖర్చులతో ఎకరా స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత 2002లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి సహకారంతో షాదిఖానా నిర్మాణం చేపట్టారు. కొంత కాలానికి షాదీఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో అత్యాధునిక హంగులతో షాదిఖానా నిర్మించేందుకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రూ.2.2కోట్లను మంజూరు చేయించారు. అయితే నేడు షాదిఖానా పేరుతో కొందరు రాజకీయాలు చేయాలనుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

- గౌస్‌ఆజం, మైనార్టీ నాయకులు, ఆత్మకూరు

పోలియో మహమ్మారిని తరిమికొట్టాలి: కలెక్టర్

నంద్యాల క్రైం, మార్చి 3 : పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వద్దగల నలంద స్కూలులో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో వారు పాల్గొని చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులంతా అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కేంద్రాల్లో చుక్కలు వేయించుకోని చిన్నారులకు వైద్య ఆరోగ్య సిబ్బంది సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ ప్రసన్నలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- 6 నుంచి పుణ్య స్నానాలు రద్దు
- గర్భాలయం ప్రవేశం కూడా..
- భక్తులకు నిరంతరం నిజరూప దర్శనం



ఈవో కాపుచంద్రశేఖర్‌రెడ్డి

మహానంది, మార్చి 3: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో భక్తుల కోసం క్షేత్రంలో ఏర్పాటు చేసిన పనులను వివరించారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండంలో భక్తులకు పుణ్య స్నానాలు రద్దు చేశామని తెలిపారు. రెండో ప్రాకారంలోని రెండు కోనేర్లలో యథావిధిగా పుణ్యస్నానాలు చేసుకోవచ్చునని వెల్లడించారు. గర్భాలయంలో ఆర్జిత సేవలతోపాటు ప్రత్యేక దర్శనాన్ని రద్దు చేశామని చెప్పారు. 8న రాత్రి 10 గంటల నుంచి జరిగే లింగోద్భవ పుణ్యకాలంలో భక్తులకు దర్శనం కల్పించినట్లు తెలిపారు. భక్తులు వాహనాలను నిలిపేందుకు ఆలయానికి అత్యంత సమీపంలోనే పార్కింగ్ ఏర్పాటు చేసి నీటి వసతి, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొనే సమయంలో ఎలాంటి ఆటంకాలు కల్గకుండా ఉండేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో చర్చించి కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు ఇబ్బందులు కల్గకుండా ఏడు ప్రత్యేక ఆర్జిత టికెట్ల కౌంటర్లతోపాటు అదనపు క్యూలైన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. లక్షా యాభై వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు. భక్తుల కోసం మూడు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

● పోలియో రహిత సమాజానికి కృషి చేద్దాం ● నేడు, రేపు ఇళ్ల వద్దకే వైద్య సిబ్బంది ● పల్స్ పోలియో కార్యక్రమాలను పరిశీలించిన వైద్యాధికారులు

మహానంది, మార్చి 3: నంద్యాల జిల్లాలో 90 శాతం పల్స్ పోలియో విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా సర్వజన వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఆదివారం మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌లోని చెంచుకాలనీలో జరుగుతున్న పల్స్ పోలియో కేంద్రాన్ని డీఎంహెచ్‌వోతో పాటు డీడీ రామనాథం ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులకు సిబ్బంది వేస్తున్న పోలియో టీకాలను పరిశీలించారు. అనంతరం మహానంది సమీపంలోని చెంచుగూడెంలో జరుగుతున్న పల్స్ పోలియో కేంద్రాన్ని డీడీ రామనాథం పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో 1313 పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2, 34, 862 మంది 0-5 వయస్సు మధ్య ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు చెప్పారు. దీని కోసం 2 వేల 626 టీంలను ఏర్పాటు చేసామన్నారు.ఇందులో 60 ట్రాన్స్‌పాయింట్లతో పాటు 306 మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి చెంచుకాలనీలు, ఇటుకల బట్టీల వద్ద ఉన్న చిన్నారులకు ప్రత్యేకంగా దృష్టి పెట్టి పోలియో టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 4,5 తేదీల్లో డోర్ టూ డోర్ వైద్య సిబ్బంది తిరిగి మిగిలిన చిన్నారులకు పోలియో టీకాలను వెయ్యడం జరుగుతుందని డీఎంహెచ్‌ఈవో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంపీహెచ్‌ఈవోలు ఉసేన్‌రెడ్డి, జగదీశ్వరప్ప, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు, నారాయణపురం గిరిజన ఆసుపత్రుల పరిధిలో పల్స్ పోలియో చుక్కల అందజేత కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఆదివారం జాతీ పోలియో దినోతసవాన్ని పురస్కరించుకుని పోలియోచుక్కల కార్యక్రమం చేపట్టారు. బండిఆత్మకూరు పీహెచ్‌సీ పరిధిలో 3033 మంది పిల్లలకు గాను 2893 మందికి, నారాయణపురం గిరిజన ఆసుపత్రి పిధిలోని 3069 మందికి గాను 3011 మందికి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు కిరణ్‌కుమార్, భావన, సవిత, దినేష్‌బాబు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గోస్పాడు,: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పని సరి అని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా గోస్పాడు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాలలో 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తున్నామని డాక్టర్ గోపాల్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 2767 చిన్నారులు ఉండగా 2689 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించామని తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఇంటి వద్దకే వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా ఆత్మకూరు మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీ, కొట్టాలచెరువు పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 3326 మంది అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5ఏళ్లలోపు చిన్నారులు ఉండగా 3288 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో 98 శాతంగా నమోదైంది. అన్ని గ్రామాల్లో మొబైల్ బృందాల ఆధ్వర్యంలో


గాజులపల్లి ఆర్ఎస్ చెంచుగూడెంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పోలియో చుక్కల ప్రక్రియ కొనసాగింది. వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్, గోపాల్‌నాయక్‌పోలియో చుక్కల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ.. దేశంలో పోలియోను నిర్మూలించేందుకు తోడ్పాటునందించాలని చెప్పారు. రెండు చుక్కలు జీవితాన్ని నిలుబెడుతోందన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలని సూచించారు. అలాగే పోలియో చుక్కలు వేయించని వారికి మరో రెండు రోజులు పాటు ఇళ్లకు వద్ద పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, సూపర్ వైజర్లు రమణమ్మ, సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, వైద్యసిబ్బంది ఉన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి, ఎర్రమఠం, గోకవరం పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం 3,453 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా.. మొదటి రోజు ఆదివారం 3,309 మంది చిన్నారులకు ఫల్స్ పోలియో చుక్కలు వేశారు. అందులో కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో 1549 మందికి గానూ, 1472 మంది చిన్నారులకు చుక్కలు వేశారు. వీటిలో 13 పోలియో కేంద్రాల్లో 26 టీములు పాల్గొన్నాయి. అలాగే ఎర్రమఠం పీహెచ్‌సీ పరిధిలో 874మందికి గాను 856 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇందులో 8 బూతులలో 16 టీములు పాల్గొన్నాయి. అలాగే గోకవరం పీహెచ్‌సీ పరిధిలో 1036 మందికి గానూ 982 మంది చిన్నారులకు వేశారు. 9 పోలియో బూతులలో 8 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వైద్యాధికారులు మహమ్మద్ భేగ్, దీపా నాగవేణి, ఎర్రమఠం వైద్యాధికారులు మహ్మద్ జబీర్, హకీం రషీద్, గోకవరం వైద్యాధికారులు విజయేంద్ర, జుబేదాతో పాటు ఆయా పీహెచ్‌సీల వైద్యసిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. సోమ, మంగళవారాల్లో మిగిలిన చిన్నారులకు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు.

గడివేముల: చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మండల వైద్యాధికారి జబీన్ తెలిపారు. మండలం 5,931 మంది చిన్నారులు ఉండగా 5,734 మంది చిన్నారులకు పోలియో చుక్కలు


నాయినిచెరువు చెంచుగూడెంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు

వేయించామని ఆమె తెలిపారు. 5 సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

పాములపాడు: మండలంలో ఆదివారం 95 శాతం పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి నాగలక్ష్మి, గులాబ్‌షా తెలిపారు. మండలంలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు 3989 మంది చిన్నారులు ఉన్నారు. అందులో 95 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 28 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామని 112 మంది సిబ్బంది 3 సూపర్ వైజర్లు ఇద్దరు డాక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిగతా 5శాతం చిన్నారులకు ఇంటింటికి దుల పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 96 శాతం జరిగినట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ సాజిదా ఫిర్దోస్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని 25 పోలియో చుక్కల కేంద్రాల పరిధిలో మొత్తం 4368 మంది 0నుంచి 5ఏళ్లలోపు చిన్నారుల ఉండగా 4193 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో 96శాతం నమోదైందని తెలిపారు.

నందికొట్కూరు: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలియో చుక్కలు వేయడం ప్రారంభించారు. పట్టణంలోని సాయిబాబాపేట పాఠశాలలో పోలియో చుక్కల కేంద్రాన్ని చైర్మన్ పరిశీలించి అందులో 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. డా.షైని ప్రియాంక మాట్లాడుతూ పట్టణంలో 5718 మంది 0-5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారని పట్టణంలో ఏర్పాటు చేసిన 25 పోలియో కేంద్రాల ద్వారా 5106 మంది చిన్నారులకు, బస్‌స్టాప్‌లలో 125 మంది చిన్నారులు కలిపి మొత్తం 5,231 మందికి పోలియో చుక్కలు మొదటి రోజు వేయడంతో పట్టణంలో 91.48 శాతంగా నమోదైందన్నారు.

జొన్న రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి


జేసీతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), మార్చి 3: జొన్న రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని, జొన్నలను అన్‌లోడింగ్ చేసి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆదివారం రైల్వేస్టేషన్ సమీపంలోని సెంట్రల్ వేర్‌హౌస్ గోడౌన్‌లకు జొన్నలను తీసుకొని వస్తున్న రైతులు సరుకును అన్‌లోడ్ చేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి రావడంపై మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి రైతులతో కలిసి జేసీ రాహుల్‌కుమార్ రెడ్డిని, మేనేజర్ రాజులను కలిశారు. ఆయన మాట్లాడుతూ జొన్న రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు పండించిన జొన్నలను సెంట్రల్ వేర్‌హౌస్‌కు తీసుకు వస్తున్నారన్నారు. అయితే కొన్ని సమస్యల వల్ల రైతులు తెచ్చిన జొన్న లోడింగ్ రెండు, మూడు రోజుల నుంచి అలాగే ఉండటంతో అన్‌లోడింగ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకువచ్చారు. అన్‌లోడింగ్ ఆలస్యం కావడంతో లారీలు, ట్రాక్టర్లకు బాడుగలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జొన్న రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'


శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

బండిఆత్మకూరు, మార్చి 3: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మండల క్లస్టర్ ఇన్‌చార్జి కంచర్ల చిన్న లింగారెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి జీసీ పాలెం గ్రామంలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ క్యాలెండర్లను ప్రజలకు అందజేసి, వాటి వల్ల ప్రజలకు చేకూరే లబ్ధి గురించి వివరించారు. ప్రజా సంక్షేమం చూరగొనే టీడీపీకి పట్టం కట్టి, చంద్రబాబును సీఎం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, షఫీవుల్లా, చంద్రపాల్, రమణ పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళి మనుగడ'


గోస్పాడులో భూమి పూజలో పాల్గొన్న విజయరామ్, తదితరులు

గోస్పాడు, మార్చి 3: మానవాళి మనుగడ ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని ప్రకృతి వ్యవసాయ పితామహుడు పాలేఖర్ శిష్యుడు విజయరామ్ అన్నారు. ఆదివారం గోస్పాడులోని చిరుధాన్యాల ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోశాల భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ఎక్కడా నష్టపరచకుండా వ్యవసాయ చేయగలిగితే ప్రకృతి కూడా రైతులకు సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులు పరిసరాలలో దొరికే వస్తువులతో సూక్ష్మ వ్యవసాయం చేయాలని అన్నారు. ప్రతి రైతు దేశవాలి విత్తనాలు వాడాలని, ఊరగాయలు, ఆకు కూరలు, విత్తనాలు దేశవాలి వాడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మనిషి ఆరోగ్యంగా లేకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారవుతుందన్నారు. ప్రతి ఇంటి దగ్గర కిచెన్ గార్డెన్ వేసుకొని సొంతంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి ప్రేమికులు దిలీప్, సంఘం ప్రధాన కార్యదర్శి రాజేష్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి, జిల్లా అగ్రికల్చర్ అధికారి మోహన్‌రావు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సురేంద్రారెడ్డి, అడిషనల్ డీపీఎం సలీంబాషా, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'


స్థలాన్ని పరిశీలిస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), మార్చి 3: ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు కోరారు. ఈ స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. మధు మాట్లాడుతూ నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీ సమీపంలోని రూ.50 కోట్ల విలువ చేసే భూమిని కొందరు నకిలీ పట్టాల ద్వారా అన్యాక్రాంతం, అక్రమంగా అనుభవించాలని చూస్తున్నారని ఈ విషయం పత్రికల్లో బహిర్గతం చేసే వరకు అధికారులకు తెలియకపోవడం దారుణమని అన్నారు. మున్సిపల్ భూమి ప్రభుత్వ ఆస్తిగా, ప్రజల ఆస్తిగా కాపాడాలని, నకిలీ రిజిస్ట్రేషన్ల అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్లపై మున్సిపల్ కమిషనర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి 50గంటలు గడుస్తున్నా ఇప్పటి వరకు బాధ్యులపై పోలీసులు కేసులు నమోదు చేకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడటానికి ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తానన్నారు. నంద్యాల పరిధిలోని 2313-1సి సర్వేనెంబరులోని స్థలం మున్సిపాలిటీకి చెందినదని, దీనిని కొందరు నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దీనిపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నా అధికారపార్టీ నాయకులు నోరు మెదపకోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొట్టి చంద్రశేఖర్, ఉపేంద్రరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

నంద్యాల (కల్చరల్), మార్చి 3: ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందనకు సోమవారం ఉదయం 9.30 గంటలకంతా జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాణ్యం, మార్చి 3: మండలంలోని సుగాలిమెట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. బండిఆత్మకూరుకు చెందిన నాగలూటి, తల్లి రమణమ్మ మోటారుసైకిల్‌పై బేతంచెర్లకు వెళ్తుండగా వెనుక వైపు నుంచి గార్లదిన్నె మండలం ఎం. కొత్తూరుకు మోటారు సైకిల్‌పై వెళ్తున్న నరసింహ, శ్రీనివాసులు ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వీరిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కాళహస్తి బ్రహ్మోత్సవాలకు కూరగాయలు



వాహనంలో కూరగాయలను పంపిస్తున్న దాత

నంద్యాల (కల్చరల్), మార్చి 3: చిత్తూరు జిల్లాలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు నంద్యాల నుంచి 25 టన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనం ద్వారా పంపించారు. ఆదివారం నంద్యాల పట్టణానికి చెందిన టి.రామన్న అండ్ సన్స్ కూరగాయల హోల్‌సేల్ వ్యాపారి లక్కబోయిన ప్రసాద్, దిలీప్‌లు 20రకాల కూరగాయలను ప్రత్యేక వాహనంలో శ్రీకాళహస్తికి పంపారు. కూరగాయల వ్యాపారి మాట్లాడుతూ ఈనెల 3 వతేది నుంచి 14వతేదీ వరకు శ్రీకాళహస్తీశ్వర ఆయల ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదానం చేయడంలో తన వంతు విరాళంగా ఉచితంగా కూరగాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత 16సంవత్సరాలుగా కాళహస్తి క్షేత్రానికి కూరగాయలు విరాళం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది ఆలయానికి గత 21 సంవత్సరాలుగా ప్రతిరోజు నిత్యఅన్నదాన సత్రానికి ఉచితంగా కూరగాయలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో జరిగే ఎటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమానికి తనవంతు సేవగా కూరగాయలను ఉచితంగా అందిస్తున్నామన్నారు.

జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు


బహుమతి అందుకున్న విజేతలతో అతిథులు

నంద్యాల (కల్చరల్), మార్చి 3: దివంగత ఎంఆర్ గోవిందరెడ్డి, ఆర్‌సీ కంబగిరి రాజు జ్ఞాపకార్థం ఆదివారం జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలను వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించారు. చిత్తలూరి రాంప్రసాద్, చింతలపల్లె కోటేష్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా డాక్టర్ రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ చిత్రలేఖన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో పోటీ అంశంగా భారత మాజీ ప్రధాని, భారతరత్న వీపీ నరసింహారావు చిత్రపటాన్ని ఇచ్చారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా ఉజవాసుకు (2గ్రాముల బంగారు పతకం), కె.గణేష్‌కు 20 గ్రా వెండి పతకం, ఆర్.వర్షితకు 10గ్రాముల వెండి పతకం, పది ప్రత్యేక ప్రశంసా బహుమతులు అందజేశారు.

గుడిసె దగ్ధం

పాములపాడు, మార్చి 3: మండలంలోని జూటూరు గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ గుడిసె పూర్తిగా కాలిపోయింది. గ్రామానికి చెందిన జనార్దన్‌గౌడ్ గుడిసెపై విద్యుత్ తీగలు రాసుకుని మంటలు చెలరేగి గుడిసె కాలిపోవడంతో గుడిసెలోని సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ.2 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన క్రాంతినగర్ యువత

నంద్యాల (నూనెపల్లె), మార్చి 3: నంద్యాలలోని క్రాంతి నగర్‌కు చెందిన యువత వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం క్రాంతినగర్‌కు చెందిన వైసీపీ నాయకులు కేఎల్ దీపక్‌రెడ్డి, బారెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా టీడీపీ తీర్థం తీసుకున్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ యువతకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ కార్యాలయంలో ఫరూక్, ఫిరోజ్‌లకు గజమాల వేసి వారు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి వెండి పాత్ర


వెండి పాత్రను ఆలయ ఈవోకు అందజేస్తున్న దాతలు

మహానంది, మార్చి 3: మహానంది క్షేత్రంలోని ప్రధాన గర్భాలయంలో ఉపయోగించే 1.25 కేజీల బరువు గల వెండి ధార పాత్రను నంద్యాలకు చెందిన వెంకటసుబ్బయ్య, శమంతకమణి దంపతులు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డికి ఆదివారం అందచేశారు. అర్చకులు సంప్రోక్షణ పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన గర్భాలయంలో భక్తులు ఇచ్చిన వెండి ధార పాత్రను ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, రఘు శర్మ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా జన్మదినం


ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే బుడ్డా జన్మదిన వేడుకలు

ఆత్మకూరు, మార్చి 3: ఆత్మకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొప్పరపు రవిప్రసాద్ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. నాయకులు కలీముల్లా, అబ్దుల్లాపురం బాషా, సుబ్బయ్య, రామ్మూర్తి, సతీష్, మల్లికార్జునరెడ్డి, దగ్గుపాటి శ్రీనివాసులు, అమ్మల్లా, మోహన్, నబిరసూల్, ఆరీఫ్, న్యామత్, ముత్యాల శ్రీనివాసులు ఉన్నారు.

● ఆర్యవైశ్య సంఘం నాయకులు కొప్పరపు రవిప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అర్థరాత్రే గౌడ్‌సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కరివేన సమీపంలోని మానవతావృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అదేవిధంగా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. అంతేకాకుండా ఆత్మకూరులోని అంబాసిద్ధేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ నాయకులు ముత్యాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు శివస్వాములు పాలు, పండ్లను పంపిణీ చేశారు.

బండిఆత్మకూరు: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో శ్రీశైలం మాజీ ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి 20 కేజీల కేక్‌ను టీడీపీ నాయకులు డిష్ రామలింగం, కృష్ణారెడ్డి, శివప్రసాద్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.

మహానంది: టీడీపీ శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మహానందిలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి. సూరే శ్రీనివాసులు, గని చిన్న రంగస్వామి, రామచంద్రుడు ఆధ్వర్యంలో మహానంది పార్టీ కార్యాలయం వద్ద వేడుకలను నిర్వహించారు. మానసిక వికలాంగుల పాఠశాలలో తెలుగు యువత కార్యదర్శి .క్రాంతి కుమార్, శివ ఆధ్వర్యంలో బుడ్డా జన్మదినాన్ని పురష్కంచుకొని వేడుకల నిర్వహించారు.

దుర్గా భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గడివేముల, మార్చి 3: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో ఆదివారం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర పాలకుడు కాల భైరవుడికి పూజలు నిర్వహించి దుర్గాభోగేశ్వరులకు అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సునిల్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నంద్యాలకు ఉత్సవమూర్తులు

మహానంది, మార్చి 3: మహానంది మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే స్వామి, అమ్మ వార్ల కల్యాణానికి పెళ్లి పెద్దను ఆహ్వానించడానికి మహానందీశ్వరస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలు సోమవారం సాయంత్రం నంద్యాలకు బయలు దేరుతాయని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మార్గమధ్యంలోని గ్రామాల్లో ఉత్సవమూర్తులకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి కాయకర్పూరాలు సమర్పిస్తారన్నారు. రాత్రి నంద్యాల పట్టణంలోని బ్రహ్మానందీశ్వరుని ఆలయం చేరుకుంటాయని చెప్పారు. తిరిగి మంగళవారం పెళ్లిపెద్ద అయిన గంగా పార్వతీ సమేత బ్రహ్మానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులతో కలసి మహానందీశ్వరుని ఉత్సవమూర్తుల విగ్రహాలు రాత్రి 10 గంటలకు మహానందికి చేరుకుంటాయని తెలిపారు. దీంతో మహానందిలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు.

నేటి పోలీసు స్పందన రద్దు

నంద్యాల క్రైం, మార్చి 3: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నేడు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి జిల్లా నలుమూలల నుంచి వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని మాత్రమే తాత్కాలికంగా రద్దు చేశామని, జిల్లాలోని ఆయా సబ్ డివిజన్, సర్కిల్ కార్యాలయాలు, అన్ని పోలీస్‌స్టేషన్లలో యథావిధిగా సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. వచ్చే సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఘనంగా సంఘ మిత్ర సేవా సమితి వార్షికోత్సవం

నంద్యాల (కల్చరల్), మార్చి 3: నంద్యాల వైఎస్సార్ కళ్యాణ మండపంలో ఆదివారం సంఘమిత్ర సేవా సమితి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘమిత్ర సేవాసమితి అధ్యక్షులు కె.నాగసుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేశం కృష్ణారెడ్డి, ఏపీ ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ వేణుగోపాల నాయుడు, ఐసీడీఎస్ పీవోట లీలావతి, కమిటి సభ్యులు చిలుకూరి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. సంఘమిత్ర విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పురప్రముఖులు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు, మేడా మురళి, శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి'



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నందికొట్కూరు, మార్చి 3: స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని, లేకపోతే 5న కంపెనీ ముందు రిలే నిరాహార దీక్ష చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం నియోజకవర్గ సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో నాయకులు ఫక్కీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ మాట్లాడుతూ నేషనల్ హైవే 340 - సి జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకపోయినా విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నారన్నారు. గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఓవర్‌లోడ్ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. నేషనల్ హైవే బ్రిడ్జి నిర్మాణాలు కంకరపై వాటర్ క్యూరింగ్ సక్రమంగా జరగడం లేదన్నారు. భూములు కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించక పోగా, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు శ్రీని వాసులు, ఓబులేసు, ఈశ్వరమ్మ, నాగన్న, వెంకటేశ్వర్లు, రాము, హుస్సేనమ్మ, శివరాముడు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, నాగమ్మ పాల్గొన్నారు.

'పర్యావరణ సమతుల్యత తప్పనిసరి'



కేసీ కెనాల్ కట్టపైన మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గోస్పాడు, మార్చి 3: మానవ జీవన మనుగడకు పర్యావరణ సమతుల్యత తప్పనిసరిగా అవసరమని మహానంది వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ డాక్టర్ సంతోష్‌కుమార్ నాయక్ అన్నారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా కానాలపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాల, రైతు భరోసా కేంద్రం, కెసీ కెనాల్ పరిసర ప్రాంతాలలో, రైతుల ఇంటి ఆవరణంలో దాదాపు 150 మొక్కలను నాటారు. సంతోష్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లు అని, ప్రతి గ్రామం చెట్లతో పచ్చగా ఉంటే ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ నారాయణ రావు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.





టీడీపీతోనే దళితుల అభివృద్ధి

- జగన్ అధికారి మదాన్ని దించాలి
- జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు

కర్నూలు(అర్బన్), మార్చి 3: తెలుగుదేశం పార్టీతోనే దళితుల అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఎంఆర్సీ ఫంక్షన్ హాలులో నంద్యాల, కర్నూలు జిల్లాల మహా గర్జన సభ జరిగింది. భారీ ఎత్తున దళితులు తరలి వచ్చిన సభకు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధరూర్ జేమ్స్ అధ్యక్షతన సదస్సు జరిగింది. అంతక ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు తమకు జరిగిన అన్యాయానికిగాను ఈ ఎన్నికల్లోజగనోహ్మన్‌రెడ్డి మదాన్ని దించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దళిత యువకుడిని వైసీపీ ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేస్తే చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇసుక దందాను అడ్డుకున్న మరో దళితుడిని శిరోముండనం చేశారని, డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపిన లాంటి ఘటనతోపాటు దాదాపు ఆరు వేల మంది దళితులు దాడులకు గురయ్యారని, వేల మంది మహిళలపైన అత్యాచారాలు జరిగాయని తెలిపారు. తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ మరణిస్తే ఏడు నెలలు ఆ కుటుంబాన్ని పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని రద్దు చేయాలని గత కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో నిర్ణయం తీసుకుంటే దేశ వ్యాప్తంగా చేసిన ఆందోళనల్లో 11 మంది మరణించారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానం చేసి ఎస్సీలకు రక్షణ చట్టం ఉండాల్సిందేనని కేంద్రానికి నివేదిక పంపిన మొదటి సీఎం అని గుర్తు చేశారు. దళితులు సాగులో ఉన్న 11 వేల ఎకరాలను లాక్కున్న దుర్మార్గుడు ముఖ్యమంత్రి అని ధ్వజమెత్తారు. నియోజవర్గాల ఇన్‌చార్జిలు టీజీ భరత్, జయనాగేశ్వరరెడ్డి, మీనాక్షి నాయుడు, గొగ్గుల దస్తగిరితోపాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలి



విభజించు, పాలించు తీరు జగన్‌ది. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటు హక్కుతో దళితులు బుద్ధి చెప్పాలి. ఆనాడు పటేల్ వ్యవస్థను రూపు మాపి దళితులకు అన్ని రంగాల్లో స్వేచ్ఛను ప్రసాదించిన మహనీయుడు నందమూరి తారక రామారావు, స్ఫూర్తితో చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో పార్టీ అన్ని వర్గాలను ఆదుకునేందుకు ఆవిర్భవించిన టీడీపీని గెలిపించుకోవాలంటే దళితులంతా ఆలోచించి ఓటు వేయాలి., దళిత ద్రోహి జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో 14 ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

దళిత ద్రోహి జగన్‌రెడ్డి



దళిత ద్రోహి జగన్‌రెడ్డి, దళితుల అభివృద్ధి ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని దళిత సోదరులు ఇప్పటికే గుర్తించారు. అందుకే ఎక్కడ చంద్రబాబు, లోకేశ్, సభలు పెట్టినా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో దళిత సంక్షేమం పూర్తిగా పడకేసింది. నవరత్నాల పేరుతో కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారు. జిల్లాలో దళితులంతా జగన్ అరాచకాలపై విసుగు చెందారు. ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెబుతారు.

- ధరూర్ జేమ్స్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

జగన్‌ను ఇంటికి పంపుదాం



దళితుల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లను నవరత్నాల పేరుతో నిర్వీర్యం చేశాడు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితి ఉంది. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు పోస్టులు ఏర్పాటు చేసి రూ. 1500 కోట్లు కాజేశాడు.

- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఇన్‌చార్జి

దళిత జేఏసీ చైతన్యం చేస్తోంది




కర్నూలు నగరంలో దళిత జేఏసీ నాయకులు వాడ వాడలో చైతన్యం తెస్తున్నారు. అమరావతిలో 15 మండలాల్లో దళితులు ఉన్నారు. అక్కడ ఎక్కువ శాతం నష్టపోయింది దళితులే. మూడు రాజధానులంటూ రుషికొండలో ఫైవ్ స్టార్ హోటల్ కట్టారు. వైఎస్సార్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే డోర్ డెలివరీ చేస్తారు. జాగ్రత్త.. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలి.

- టీజీ భరత్, కర్నూలు ఇన్‌చార్జి



అరాచకాలు గుర్తుంచుకోవాలి



దళితులు, బడుగుల పట్ల ఎన్నో అరాచకాలు చేసిన జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించకపోతే ఎంతో నష్టపోతాం. ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన మహానుభావుడు జగన్‌రెడ్డి. ఎస్సీ సబ్ ప్లాన్‌కు గుండు కొట్టించాడు. ఏ ఒక్క మచ్చలేని చంద్రబాబును జైలుకు పంపించాడు. జగన్ అరాచకాలను గుర్తుంచుకొని ఎన్నికల్లో వ్యవహరించాలి.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎమ్మిగనూరు

జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం



ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోని టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించుకుందాం. ఈ ప్రభుత్వంలో తాగడానికి నీరు అడిగితే మహిళను ట్రాక్టరుతో తొక్కించి చంపిన చరిత్ర వైసీపీ పాలనలో సాగుతోంది. రాష్ట్రంలో ఒక నియంత, రాక్షసుడితో పోరాడి గెలవాల్సిన అవసరం ఉంది.

-ఆకెపోగు రాంబాబు

దళితులపై చిత్త శుద్ధి ఉంది



రాష్ట్రంలో దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి ఓటు అనే ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పాలి. ఒక ఎస్సీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని ఎంపిక చేసిందంటే టీడీపీకి దళితులపై చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఎస్సీలంతా పార్టీ అధినేత చెప్పిన మాట ప్రకారం ప్రతి కార్యకర్త, నాయకుడు ముందుకు పోవాలి.

-మీనాక్షి నాయుడు, ఇన్‌చార్జి, ఆదోని

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 3: రాష్ట్రంలో ఉన్న 11 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా అధికారంలోకి రాకముందు సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎస్‌ను రద్దు చేయకపోగా దాని స్థానంలో దుర్మార్గమైన జీపీఎస్‌ను తీసుకురావడం పట్ల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, బి. వెంకటేశ్వర్లు, ఆర్థిక కమిటీ సభ్యుడు సుంకన్న, రాష్ట్ర కో అధ్యక్షుడు సమ్మూర్తి, మహేష్, మహ్మద్ షఫి, వీరచంద్ర యాదవ్ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ జాబితా వెల్లడి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 3: జిల్లా విద్యాశాఖ జీవో.ఎంఎస్. నెం.79 ప్రకారం అర్హులైన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు జూనియర్ లెక్చరర్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ జాబితాను వెల్లడి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూయేల్ ఆదివారం తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ సమాచారం ఇవ్వాలని, లేకపోతే తమ దగ్గర ఉన్న జాబితాను ఫైనల్ జాబితాగా పరిగణిస్తామని అన్నారు.

టీడీపీలో చేరనున్న చెరకుచర్ల రఘురామయ్య



చెరకుచర్ల రఘురామయ్య

నందికొట్కూరు, మార్చి 3: వైసీపీని వీడిన ఆ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరకుచర్ల రఘురామయ్య టీడీపీలో చేరేందుకు మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది. త్వరలో నంద్యాలలో జరిగే ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో చేరేందుకు టీడీపీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని పాములపాడు, కొత్తపల్లి, పగిడ్యాల, నందికొట్కూరు, మిడ్తూరు మండలాల నుంచి 100 నుంచి 150 వాహనాల్లో దాదాపు 1200 నుంచి 1500 మంది తన అనుచరులతో కలిసి నంద్యాలలో జరిగే ప్రజాగళం సభలో పార్టీలో చేరుతున్నట్లు చెరకుచర్ల రఘురామయ్య తెలిపారు. నందికొట్కూరు అభ్యర్థి, నంద్యాల ఎంపీ అభ్యర్థులుగా పార్టీ ఎవరిని ప్రకటించినా అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. పార్టీలోని అందరూ నాయకులతో కలుపుకొని టీడీపీ విజయం కోసం పాటు పడతామని ఆయన తెలిపారు. నంద్యాలలో ప్రజాగళం సభ ఈనెల 6వ తేదీ జరగాల్సి ఉండగా చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమంలో వాయిదా పడినట్లు తెలుస్తోంది. 7వ తేదీ నుంచి నంద్యాల్లో ఎప్పుడు జరిగినా ఆ సభలో ఆయన టీడీపీలో చేరనున్నారు.

షాదిఖానా ప్రారంభోత్సవానికి జనం కరువు

ఆత్మకూరు, మార్చి 3: రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీల ఓట్లను గంపగుత్తగా పొందేందుకు ఆత్మకూరులో అధికార వైసీపీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన షాదిఖానా ప్రారంభోత్సవానికి వేల సంఖ్యలో ముస్లిం మైనార్టీలు తరలివస్తారన్న అంచనాలు కాస్త తారుమారు కావడంతో వైసీపీ నేతలు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హడావిడిగా షాదిఖానా నిర్మాణాన్ని పూర్తి చేసి ఆదివారం ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే స్థానిక కొత్తపేట మసీదు నుంచి షాదీఖానా వరకు వేల సంఖ్యలో ముస్లిం మైనార్టీలతో కలిసి ర్యాలీగా వెళ్లాలని భావించారు. ఇందుకు ఆర్భాటమైన ప్రచారం కూడా చేశారు. కానీ ర్యాలీకి జనం ఊహించినంతగా రాలేదు. వచ్చిన వారిలో వైసీపీకి చెందిన వ్యక్తులే అధికంగా ఉన్నారు. షాదిఖానా ప్రారంభోత్సవం అనంతరం ముస్లిం మైనార్టీల ఆత్మీయ కలయిక పేరుతో సభను నిర్వహించారు. ఇందులో కూడా పెద్దగా జనం కనిపించలేదు. ఇదిలావుంటే మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు షాదీఖానా ప్రారంభోత్సవానికి హాజరుకాకపోవడం గమనార్హం.

మోసాల పాలన పోవాలి

- రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ
- కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


డోన్, మార్చి 3: రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారం చేసిన వైసీపీ మోసాల పాలన పోవాలని.. కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ బూత్ కమిటీలపై కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్ తదితరులతో చర్చించారు. అనంతరం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ తన అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కల్తీ మద్యం, గంజాయి, మాఫియాలకు అడ్డాగా రాష్ట్రాన్ని మార్చి యువత భవిష్యత్తును వైసీపీ నాశనం చేసిందని అన్నారు. వైసీపీ పాలనపోయి అభివృద్ధిని అందించే చంద్రబాబు పాలన రావాలని అన్నారు. గత టీడీపీ హయాంలో ఐటీ కంపెనీలు, కియా వంటి పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. డోన్ నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలు మూతపడి నిరుద్యోగ యువత కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైసీపీ పాలనలో రైతులకు అప్పులు, నష్టాలే మిగిలాయన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండి కోటరామసుబ్బయ్య, సుధీష్, చంద్రపల్లి ఆచారి, గోవిందరెడ్డి, గోసానిపల్లి మల్లయ్య, మాజీ సర్పంచ్ భోగేశ్వరరెడ్డి, వలసల బాలుడు, రవి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మద్దతు తెలుపుతున్న ఇందిరా నగర్ యువకులు

టీడీపీ హయాంలోనే అభివృద్ధి: గౌరు చరిత

పాణ్యం, మార్చి 3: టీడీపీ హయాంలోనే పాణ్యం అభివృద్ధి జరిగిందని పాణ్యం నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. స్థానిక సిమెంటు వ్యాపారి మూల రాంమోహన్‌రెడ్డితో పాటు మరి కొంత మంది ఆదివారం గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. గౌరు చరిత, టీడీపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖ ర్‌లు వారిని టీడీపి కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాణ్యం మండలం టీడీపీ హయాంలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. వైసీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే కాటసానిని పదవి నుంచి దించడాకి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు జయరామిరెడ్డి, రామమోహన్‌నాయుడు, మాజీ సర్పంచ్ గంగా నారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



టీడీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న గౌరు చరిత

కోలుకోలేక యువకుడి మృతి

బేతంచెర్ల, మార్చి 3: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల పుల్లయ్య కుమారుడు వేణుగోపాల్ (20) అనే యువకుడు కర్నూలు ప్రభుత్వంలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని ఏఎస్‌ఐ లింగమయ్య ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన వేణుగోపాల్ డోన్ పట్టణంలోని జూనియర్ కాలేజీలో చదువుతున్నాడు. కాగా కళాశాలకు సరిగ్గా పోవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన వేణుగోపాల్ గత నెల 29న గ్రామ సమీపంలోని బలిజ సాంబయ్య పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడని ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

ఆలూరులో వైసీపీ సమన్వయకర్తల సమావేశం

- గైర్హాజరైన ఆలూరు జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ
- చివరి వరకు ప్రోగ్రాంపై రాని స్పష్టత



ఆలూరులో పర్యటిస్తున్న వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి

ఆలూరు, మార్చి 3: ఆలూరు వైసీపీలో మంత్రి గుమ్మనూరు జయరాం మార్కు ఆధిపత్యం సాగుతోంది. ఆదివారం ఆలూరు పట్టణంలో ఆలూరు వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి పర్యటనకు ముందు రోజే ఏర్పాట్లు చేసినా, ఆదివారం ఉదయం మంత్రి జయరాం కొందరి ముఖ్యనేతలకు ఫోన్లు చేసి కార్యక్రమానికి వెళ్లవద్దని సూచించినట్లు తెలిసింది. దీంతో ప్రోగ్రాం వాయిదా వేసినట్లు కార్యకర్తలకు కొందరు ఫోన్లు చేయగా, విరుపాక్షి మాత్రం తాను కార్యక్రమానికి వస్తానని, ఎందుకు వాయిదా వేస్తారని అనడంతో ఆలూరు మాజీ ఎంపీటీసీ కిషోర్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో పర్యటించారు.

కార్యక్రమానికి జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ గైహాజరు

వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి నిర్వహించిన కార్యక్రమానికి చివరి క్షణంలో జడ్పీటీసీ సభ్యులు ఏరూరు శేఖర్, వైస్ ఎంపీపీ నాగవేణి, భర్త శ్రీధర్ వర్గం గైర్హాజరు అవ్వడం పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి ఫోన్ చేయడం వల్లే కార్యక్రమానికి హాజరు కాలేదని కొందరు చర్చించుకుంటుండగా, అలా ఏమీ లేదని, తన వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చిందే తప్ప, ఇతర కారణాలు లేవని, తాను వైసీపీలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ వెంటే తాము నడుస్తామని వైస్ ఎంపీపీ భర్త శ్రీధర్ తెలిపారు. ఏది ఏమైనప్పటికీ వైసీపీలో మాత్రం వర్గవిభేధాలు మాత్రం వీడటం లేదు.

మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే



ప్రమాణం చేస్తున్న వైద్య విద్యార్థులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 3: కర్నూలు మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి కళాశాల మైదానంలో 2018 బ్యాచ్ వైద్యుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ డా.పి.సుధాకర్, డా.పీఎస్ జిక్కి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, డా.హరిచ రణ్ పాల్గొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసినవారికి పట్టాలు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ డా.హరిచరణ్ డా.నివేదిత దంపతుల కూతురు పి.నమ్రత ఏకంగా ఏడు విభాగాల్లో గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఎన్.నాగహారిక (బయోకెమిస్ట్రి), సాయితరుణ్, వెంకట వైష్ణవి, (పెథాలజి) వెంకట వైష్ణవి (ఈఎన్‌టీ) నాగహరిక (అప్తామాలజి), సాయి తరుణ్ (ఎస్‌పీఎం), వంశీకృష్ణ, కీర్తన (గైనిక్)లలో గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్: టీడీపీ

బనగానపల్లె, మార్చి 3 : నిరుద్యోగులను సీఎం జగన్ నట్టేటా ముంచాడని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ, టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, బీసీ రామనాథ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం జిల్లాలోని బనగానపల్లె పట్టణంలోని ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బనగానపల్లె నియోజకవర్గం తొలి ఓటర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మ వారు మాట్లాడుతూ తొలిసారి ఓట్లను నమోదు చేయించుకున్న యువ ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని రాష్ట్రం అభివృద్ధి చెందేలా టీడీపీ-జనసేన కూటమికి ఓట్లు వేసి తమ భవిష్యత్‌ను మలుకుకోవాలని పిలుపునిచ్చారు. ఓటుహక్కు అనేది చాలా పవర్‌ఫుల్ అన్నారు. ప్రభుత్వాలను తారుమారు చేసే శక్తి యువ ఓటర్లకు ఉందన్నారు. నాపరాయి పరిశ్రమను పరిరక్షించడానికి రాయల్టీని తగ్గించి నాపరాయి పరిశ్రమను ఆదుకున్న వ్యక్తి బీసీ జనార్దన్‌రెడ్డి అయితే రాయల్టీని పెంచిన ఘనత కాటసాని రామిరెడ్డిది అని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాయల్టీ తగ్గిస్తానని హామీ ఇచ్చిన బీసీ అప్పటి సీఎం చంద్రబాబునాయుడును ఒప్పించి రాయల్టీ తగ్గించారన్నారు. అలాగే బందార్లపల్లెలో చెక్‌పోస్టు ఎత్తివేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత రేకుల షెడ్‌లో ఉన్న చెక్‌పోస్టుకు భవనాన్ని నిర్మించి నాపరాయి యజమానులు, కార్మికులను మోసం చేశారని విమర్శించారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు విద్యుత్ ఫ్రీగా అందిస్తామని చెప్పి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన జగన్ ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు నిరుద్యోగ యువతకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇచ్చామని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువగళం పథకం కింద నిరుద్యోగులకు రూ.3వేలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. యువత తమ ఓటుహక్కును టీడీపీ-జనసేన పార్టీలకు వేసి భారీమెజార్టీతో బీసీ గెలిపించాలని పిపునిచ్చారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం పక్కీర్‌రెడ్డి, యువత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ


హాజరైన నాయకులు

కోట్ల, కేఈలతోనే డోన్ నియోజకవర్గ అభివృద్ధి

డోన్(రూరల్), మార్చి 3: కోట్ల, కేఈల హయాంలోనే డోన్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన టీడీపీ సమావేశంలో పాల్గొన్న టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని జనసేన నాయకులు కలిసి భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి జనసేన నాయకులకు ఆయా కార్యక్రమాలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ డోన్‌లో మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధి పేదలకు ఏ మాత్రం ప్రయోజనం కల్గించడం లేదన్నారు. డోన్‌లో ఏర్పాటు చేసిన వందపడకల ఆసుపత్రి పనులు పూర్తి కాకుండానే మంత్రి ప్రారంభించారని, పూర్తి స్థాయిలో వంద పడకల ఆసుపత్రి సేవలు ప్రజలకు అందుబాటులోకి రాలేదని విమర్శించారు. కార్యక్రమంలో డోన్ జనసేన కోఆర్డినేటర్ బ్రహ్మం, నాయకులు కొత్త కోట రామచంద్రుడు, మధు కుమార్, రాజశేఖర్, బాషా పాల్గొన్నారు.


కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసిన జనసేన నాయకులు

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, మార్చి 3: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల సాధికారత టీడీపీతోనే సాధ్యమని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హాయంలో బీసీలకు ఆదరణ పనిముట్లు, కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పంపిణీ చేశారని అన్నారు. వైసీపీ పాలనలో కార్పొరేషన్ నిధులు నిర్వీర్యం చేశారన్నారు. బీసీల సంక్షేమాన్ని వైసీపీ విస్మరించిందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, చిన్ని కృష్ణయ్య, లాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం


చాగలమర్రి గంగమ్మ ఆలయంలో దీపోత్సవం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, మార్చి 3: చాగలమర్రి గ్రామంలోని గంగమ్మ ఆలయంలో మాఘమాసం సందర్భంగా మహిళలు ఆదివారం 108 దీపాలు వెలిగించి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా దీపాలు చేతపట్టి ప్రత్యేక హారతులు ఇచ్చారు. సామూహిక ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సును విజయవంతం చేయండి

డోన్, మార్చి 3: మంగళగిరిలో ఈ నెల 5న జరిగే టీడీపీ జయహో బీసీ సభను విజయవంతం చేద్దామని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజావైద్యశాల మల్లికార్జున మాట్లాడుతూ బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచిన ఏకైక పార్టీ తెలుగుదేశమే అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా బీసీల కోసం డిక్లరేషన్ ప్రకటించనున్నారనీ అన్నారు. బీసీలు ఆత్మగౌరవంతో బతికేలా ఎన్టీఆర్ కృషి చేశారనీ, బీసీలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చంద్రబాబు చేయూతనిచ్చారన్నారు. జిల్లాలోని బీసీ సెల్ విభాగాల కమిటీల సభ్యులందరూ టీడీపీ జయహో బీసీ సభలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

బనగానపల్లె, మార్చి 3 : గ్రామాల్లో ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నంది వర్గం ఎస్ఐ తిరుపాలు అన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో ఆదివారం రాత్రి పర్యటించారు. టంగుటూరులో గ్రామసభ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు, రోడ్డుప్రమాదాలు, సైబర్ నేరాలు, నేరాల గురించి అవగాహన కల్పించారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి


జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులను సత్కరిస్తున్న బనగానపల్లె ఆర్యవైశ్య సంఘం నాయకుడు టంగుటూరు శ్రీనయ్య

బనగానపల్లె, మార్చి 3 : ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, ఆర్యవైశ్య సంఘం బనగానపల్లె పట్టణ శాశ్వత అధ్యక్షుడు పీఎస్ఎస్ నారాయణ, మాజీ ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దమ్మాల వెంకటసుబ్బయ్యలు అన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా జిల్లా అధ్యక్షుడు భవనాసి మహేశ్, బిగిమల్ల శాంసుందర్‌గుప్తా, పొలిటికల్ ఛైర్మన్ కొత్తసుబ్బయ్య, విజయశేఖర్ మామిళ్ల నాగరాజు, సతీశ్, ఇతర కార్యవర్గ సభ్యులకు బనగానపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పట్టణంలో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా కూడా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నూకల సుబ్బయ్య, నూకల విజయకుమార్, శివచంద్రయ్య, భరతుడు, జంగంశెట్టి, సుబ్రమణ్యం, బచ్చు భాస్కర్, సుబ్రహ్మణ్యం, పీఎస్ఎస్ కిశోర్, నూకల వాసంతి, బండారు లలిత, ప్రకాశ్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ సమగ్రాభివృద్ధే ధ్యేయం: మంత్రి

బేతంచెర్ల, మార్చి 3: డోన్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధియే ధ్యేయమని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ రోడ్ల ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో కార్యక్రమంలో సుమారు రూ.62 కోట్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ రామచంద్రుడు, బేతంచెర్ల ఎంపీపీ నాగభూషణంరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చలంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి సంస్థ డైరెక్టర్ మురళికృష్ణ, డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● మండలంలోని మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కర్నూలు జిల్లా జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీపీ నాగభూషణం రెడ్డి, నగర పంచాయితీ ఛైర్మన్ చలంరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐ కొట్టాడని టీడీపీ వర్గీయుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న హుసేన్‌బాషా

సంజామల, మార్చి 3: సంజామల ఎస్సై రమేశ్‌రెడ్డి కొట్టాడని టీడీపీ వర్గీయుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కానాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు హుసేన్‌బాషా శనివారం మధ్యాహ్నం తన గొర్రెలు, మేకలను కొళాయి వద్ద శుభ్రం చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వెంగళరెడ్డి భార్య దేవి.. హుసేన్‌బాషా సెల్‌ను తీసుకొని నీళ్ల బకెట్‌లో వేసింది. ఈ విషయంపై ఆగ్రహించిన హుసేన్‌బాషా.. దేవి భర్త వెంగళరెడ్డితో వాదనకు దిగాడు. శనివారం సాయంత్రం వెంగళరెడ్డి ఇంటి వద్ద టీడీపీ వర్గీయులతో కలసి సెల్ విషయంపై చర్చించారు. ఈ విషయంపై ఆగ్రహించిన వెంగళరెడ్డి నీ అంతు చూస్తా అని బెదిరించడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు తారాస్థాయికి చేరుకుంది. సమస్యాత్మకమైన గ్రామమైన కానాలలో పికెటింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ ఎస్ఐకి సమాచారం అందించారు. సమాచారం అందడంతో ఎస్ఐ రమేశ్‌రెడ్డి కానాల గ్రామంలో హుసేన్‌బాషాను కొట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లాడు. అనంతరం ఆదివారం ఉదయం వెంగళరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి తనను ఎస్ఐ రమేశ్‌రెడ్డితో కొట్టిస్తావా? అంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న హుసేన్‌బాషాను బంధువులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హుసేన్‌బాషా కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా తాను హుసేన్‌బాషాపై చేయిచేసుకోలేదని ఎస్ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

డా.పేరా శ్రీధర్ రెడ్డికి పితృ వియోగం

కోవెలకుంట్ల, మార్చి 3: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు డా.పేరా శ్రీధర్ రెడ్డి తండ్రి పేరా వెంకట సుబ్బారెడ్డి (76) ఆదివారం సాయంత్రం మరణించారు. ఆయన గత కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడున్నారు. ఆదివారం సాయంత్రం మృతిచెందారు. పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఓటమి భయంతోనే బుగ్గన విమర్శలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్

డోన్, మార్చి 3: డోన్ నియోజకవర్గంలో కోట్ల, కేఈ కుటుంబాలు కలిసిపోవడంతో ఓడిపోతానన్న భయంతో మంత్రి బుగ్గన అనవసరమైన విమర్శలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడుతో కలిసి వారు మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ డోన్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. కోట్ల, కేఈ కుటుంబాలే చొరవ తీసుకుని గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి డోన్ పట్టణానికి శుద్ధజలం అందించారన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు నింపేందుకు రూ.230 కోట్లు నిధులు మంజూరు చేసింది అప్పటి టీడీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో కోట్ల, కేఈ కుటుంబాలు కలిసిపోతే మంత్రి బుగ్గన ఎందుకు కలవరం చెందుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. డోన్ పట్టణంలో నిర్వహించిన టీడీపీ ఆత్మీయ సభకు జనం పెద్ద ఎత్తున నియోజకవర్గం నుంచి ప్రజలు తరలి వచ్చి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మద్దతు తెలపడంతో మంత్రి బుగ్గన జీర్ణించుకోలేకపోతున్నారనీ అన్నారు. 5న మంగళగిరిలో జరిగే జయహో బీసీ రాష్ట్ర సదస్సుకు డోన్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీసీలంతా తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, గండికోట రామసుబ్బయ్య, టీడీపీ నాయకులు చంద్రపల్లి ఆచారి, ఆలేబాదు పరమేష్, సుధీష్ రాజు, కిరణ్ యాదవ్, భూమా నాగన్న, సంజీవుడు, వలసల బాలుడు, మాజీ సర్పంచు శ్రీరాముడు, వెంకటాపురం పెద్దయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వై. నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి: వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ గ్రామ గ్రామన తిరిగి వైసీపీ దుర్మార్గాలను ప్రజలకు వివరించాన్నారు. అందరు కలసి కట్టుగా పనిచేసి డోన్‌లో టీడీపీని గెలుపించుకుందామని నాగేశ్వరరావుయాదవ్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టి శ్రీనివాసులు, నాయకులు రామ్మోహన్‌యాదవ్, గండికోట రామసుబ్బయ్య, వెంకటరమణాచారి, ఖాజాపీర్, నాగేంద్ర, కోదండరామయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ప్రజా తీర్పు చెంపపెట్టు కావాలి: అఖిలప్రియ

● మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే స్పష్టమైన తీర్పు వైసీపీకి చెంపపెట్టు కావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి తిప్పారెడ్డి, ఉమ్మడి కృష్ణారెడ్డి, చాకలి హుసేని, బోయ నాగయ్య, కొల్లి గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితర 20 కుటుంబాలు వారి అనుచరులతో అఖిలప్రియ సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. అలాగే ఎస్సీ కాలనీకి చెందిన పగిడి ఓబులేసు, శ్రీరాముల ఓబులమ్మ, గడ్డం జయలక్ష్మి, గడ్డం పుల్లయ్య, పగిడి వెంకటేశ్వర్లు, బద్రి శ్రీనివాసులు తదితర 50 కుటుంబాలకు చెందిన వారికి మాజీ మంత్రి అఖిలప్రియ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భార్గవ్‌రామ్ నాయుడు, ఎస్‌సీ సుబ్బారెడ్డి, ఎస్ ప్రతాప్‌రెడ్డి, ఎల్‌సీ వెంకటేశ్వరరెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి, శిరిగిరి రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నాయకులు

వైసీపీ పతనం తప్పదు

దొర్నిపాడు, మార్చి 3: రాష్ట్రంలో వైసీపీకి పతనం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ బొబ్బూరి ఉమాదేవి, బొబ్బూరి వెంకటకృష్ణయ్య, బొబ్బూరి వెంకటకృష్ణనాయుడు, పామిడి గుర్రప్ప మరో 50 కుటుంబాలు ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి భూమా అఖిలప్రియ టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అఖిలప్రియ మాట్లాడుతూ వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి తప్ప రాష్ట్రాభివృద్ధి శూన్యమని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలను పరిష్కారిస్తామన్నారు. భార్గవ్‌రామ్ నాయుడు, భూమా సంతోష్‌రెడ్డి, సిద్ది సత్యం, సిద్ది నారాయణ, కొత్తపల్లి సురేంద్ర, చక్రవర్తినాయుడు, ఏరువ ప్రసాదురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, చౌడయ్య, ప్రభాకర్‌చౌదరి, మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, ఎండూరి గోపాల్‌నాయుడు, బాలిరెడ్డి, డీలర్ రమణయ్య, నిమ్మకాయల వెంకట్రామిరెడ్డి, సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● అదనపు డీఎంహెచ్‌వో జగదీష్ చంద్రారెడ్డి

చాగలమర్రి, మార్చి 3: జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు 2.52 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో జగదీష్ చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,313 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 339 మంది ఎంఎల్‌పీహెచ్, 514 మంది ఏఎన్ఎంలు, 1,597 మంది ఆశా వర్కర్లు, 1,680 మంది అంగన్‌వాడీ వర్కర్లను నియమించినట్లు తెలిపారు. పోలియో కేంద్రాలకు రాని చిన్నారులకు రెండు రోజుల పాటు ఇంటి వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

● శెట్టివీడు గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని వైద్యులు తస్లిమా సుల్తాన ప్రారంభించారు.

శిరివెళ్ల, మార్చి 3: వలస కూలీలు, ఇటుకలబట్టీల కార్మికులతో పాటు హార్డ్ రీచ్ ఏరియాలో నివాసం ఉంటున్న కుటుంబాల్లోని చిన్నారులకు సైతం పోలియో చుక్కలు వేయాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి ఆదేశించారు. శిరివెళ్లలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమ వివరాలను ఆయన ఆదివారం పరిశీలించారు. 21 బూత్‌లలో 3,856 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించి 97 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పోలియో చుక్కలను బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడసారి శివశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర ఆచారి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, జిల్లా నాయకులు ఉమ్మాజీరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవుకు: పట్టణంలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. 5,800 మంది ఉండగా 4868 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేసి 97 శాతం పోలియో చుక్కలు వేశారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నవీన్, యమున, హెల్త్‌సూపర్‌వైజర్ వేణుగోపాల్, రాజు, దానమ్మ, వరలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : మండలంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు బిజనవేముల, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, గ్రామాల్లో జరుగుతున్న పల్స్‌పోలియో కేంద్రాలను పరిశీలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 44 పల్స్‌పోలియో కేంద్రాల్లో పోలియో బూత్‌లను డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పలుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 6713 మంది చిన్నారులకు గాను 6516 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ మధుమౌనిక తెలిపారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి నాగేంద్ర ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. దొర్నిపాడు పీహెచ్‌సీ పరిధిలో 1,580 మంది చిన్నారులు ఉన్నారని, 18 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. కేంద్రాలకు రాని చిన్నారులను గుర్తించి రెండు రోజుల పాటు ఇళ్ల వద్దకు వెళ్లి ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రవికుమార్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఉన్నారు.



చాగలమర్రిలో పల్స్ పోలియో చుక్కల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు డీఎంహెచ్‌వో జగదీష్ చంద్రారెడ్డి


పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు

రుద్రవరం: పండంటి జీవతానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల వివరాల కోసం రికార్డులు పరిశీలించారు. ఆలమూరులో వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి, రుద్రవరంలో వైద్యాధికారి నవీన్ పోలియో చుక్కలు వేశారు.

ప్యాపిలి: మండలంలో 5 ఏళ్లలోపు ఉన్న 4,553 పిల్లలకు గాను 4,327 మందికి చుక్కలు వేసినట్లు వైద్యాధికారి వాశ్రీ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలో డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో 4032 మంది ఉండగా 3879 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. సీహెచ్‌వో పరమేశ్వర్‌రెడ్డి, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

సంజామల: సంజామల పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో 1043 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. ఎంపీ హెచ్ఈవో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్‌నారాయణ దాసు, సూపర్‌వైజర్ లక్ష్మమ్మ, పురుషోత్తంరెడ్డి, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు 96 శాతం పోలియో చుక్కలు వేయడం జరిగిందని ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యాధికారి డా.అబ్దుల్ హలీం తెలిపారు. ఆదివారం 4735 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా.. 4546 మందికి చుక్కలు వేశామన్నారు. కార్యక్రమంలోఓ ఎంపీహెచ్‌సీవో అబ్దుల్ గఫార్, ఆరోగ్య కార్యకర్త రామాంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'


ఆర్.నాగులవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రుద్రవరం, మార్చి 3: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని ఆర్.నాగులవరం గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలను టీడీపీ నాయకులు రెక్కల మనోహర్‌రెడ్డి, రెక్కల వెంకటరామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల వెంకటసుబ్బయ్య, దస్తగిరి, కొండా శింగరయ్య, నిమ్మకాయల గురప్ప, నాగసుబ్బయ్య, కొండా మురళి, నాగమయ్య, జమాల్, ఓబులేసు, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం తప్పదు'


చాగలమర్రిలో సూపర్-6 పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 3: రాష్ట్రంలో అరాచక పాలనకు పతనం తప్పదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు తెలిపారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలో సూపర్-6 కరపత్రాలను అందజేశారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనపై ప్రజలు విసుగు చెంది టీడీపీ పాలన కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. జరగబోయే ఎన్నికల్లో ప్రజలే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం'


తోడేండ్లపల్లెలో సూపర్-6 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని, టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్ అన్నారు. ఆదివారం చాగలమర్రి మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో సూపర్-6 పోస్టర్లను ఆవిష్కరించి గ్రామంలోని పలు రహదారుల్లో పోస్టర్లను ఏర్పాటు చేశారు. సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, శివారెడ్డి, ఓబుళపతి, చౌడన్న, రాజు, రాజా, రమణ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'


మేనిఫెస్టో గురించి వివరిస్తున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఉయ్యాలవాడ, మార్చి 3: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యని టీడీపీ నాయకుడు భూమా జగద్విఖ్యాత్‌రెడ్డి అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉయ్యాలవాడ గ్రామంలో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలు భరించలేకపోతున్నారని, అందువల్లనే ప్రతి ఒక్కరూ టీడీపీ వైపు చూస్తున్నారని అన్నారు. రైతులకు సాగునీరందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉయ్యాలవాడ మండలంలోని కుందూ తీర ప్రాంత రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నా ఎంపీ, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని వాపోయారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ కుడాల నారఆయణరెడ్డి, మండల నాయకులు బోరెడ్డి నర్శిరెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులతో పంటలు విషతుల్యం

సంజామల, మార్చి 3: రసాయన ఎరువుల వినయోగంతో పంటలు ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయని సేంద్రియ ఎరువుల పీల్డ్ అధికారి నాగేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని ముదిగేడు, ముక్కమల్ల, కమలపురి, ఆకుమళ్ల , ఆల్వకొండ గ్రామాల్లో రైతు సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు సేంద్రియ జీవన ఎరువుల గురించి వివరించారు. సేంద్రీయ ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. రైతులు , సేంద్రియ ఎరువుల సిబ్బంది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులు అన్ని రంగాల్లో రాణించాలి

● టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు

బేతంచెర్ల, మార్చి 3: సమాజంలో అగ్రవర్ణాలతో సమానంగా దళితులు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం కర్నూలులో టీడీపీ ఆధ్వర్యంలో జరిగే దళిత సింహగర్జన సభకు బేతంచెర్ల నుంచి టీడీపీ దళిత నాయకులు ఆయా వాహనాల్లో తరలివెళ్లేందుకు మండల అధ్యక్షుడు ఎల్లనాగయ్య జెండా ఊపి ప్రారంభించారు. దళిత సింహ గర్జనకు ఆదోని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, తేజభరత్, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిలో మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నంద్యాల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రూబెన్, రాష్ట్ర టీడీపీ క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.